క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏడీఈ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా ఉయ్యాల వాడ మెడికల్ కాలేజీ నుంచి శ్రీపురం రోడ్డుకు ఇరువైపులా, సంతబజార్, పోస్ట్ ఆఫీస్, పుల్లారెడ్డి ఆస్పత్రి పరిసరాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు గమనించాలని కోరారు.

నేడు రైతు సదస్సు

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట రైతు వేదిక భవనంలో మంగళవారం రైతు సదస్సు కార్యక్రమం నిర్వహిస్తునట్లు మండల వ్యవసాయ అధికారి కావేటి నరేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వానాకాలం పంటల సాగుపై రైతులకు సూచనలు, సాగు ప్రణాళిక పద్ధతులపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మండలంలోని రైతులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో మాజీ జెడ్పీటీసీ పబ్బు జంగయ్యగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాజీ ఎంపీటీసీ చక్రవర్తిగౌడ్ సోమవారం సీసీ కెమెరాలను హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేశారు. దాదాపుగా రూ.30వేలు వెచ్చించి కెమెరాల ఏర్పాటు చేసినట్లు దాత తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, నాయకులు రామస్వామిగౌడ్, రాఘవేందర్, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యంచారి, పశువులు, శ్రీను, రవీందర్‌గౌడ్, మల్లేష్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి



పెంట్లవెల్లి: ఇళ్ల స్థలాలు కేటాయించాలని సోమవారం మండలంలోని మల్లేశ్వరం, వేముకల్ గ్రామస్తులు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జయసింహకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినప్పుడు ఇళ్ల స్థలాలు, భూములు కోల్పోయామని వివరించారు. అప్పటినుంచి గుట్ట ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నామన్నారు. ప్రస్తుతం జనాభాతో పాటు ఇళ్ల సంఖ్య పెరడంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునేందుక స్థలం లేదని వాపోయారు. సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్లను నిర్మాణానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మదుగం నర్సింహయాదవ్, నర్సింహనాయుడు, బాలరాజు, శేఖర్, రాముడు, రాజుకుమార్, డిష్‌రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పశువైద్య కేంద్రం

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో నిర్మించిన గ్రామీణ పశు వైద్య కేంద్రం నిరుపయోగంగా మారింది. శ్యాంప్రకాష్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకంలో భాగంగా రూ.10 లక్షలతో నిర్మించారు. ప్రభుత్వం వైద్యులను నియమించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో పశువైద్య కేంద్రం ఎప్పుడు చూసినా తాళం వేసి మూతపడి ఉంటోంది. గ్రామంలో పశువులు, మేకలు, గొర్రెలు రోగాల బారిన పడితే వైద్యం కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. కనీసం గ్రామీణ పశువైద్య కేంద్రానికి వెటర్నరీ అసిస్టెంట్ నైన నియమించాలని రైతులు కోరుతున్నారు.



ధాన్యం విక్రయాలకు అష్టకష్టాలు

- కొనుగోలు కేంద్రాల్లో కదలని ధాన్యం
- రాత్రింబవళ్లు రైతుల పడిగాపులు



మిల్లు దగ్గర నిలిచిన లారీలు



తాడూరు కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం

తాడూరు : రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే ధాన్యం విక్రయాలకు నానా కష్టాలు పడుతున్నారు. సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల అకస్మాత్తుగా కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. చేతికందిన పంట కళ్ల ఎదుటే తడవటంతో నిరాశకు గురయ్యారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కొనుగోలు కేంద్రాల్లో ముందుకుసాగక పడిగాపులు కాస్తున్నారు. తాడూరు మండలం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడి ప్రజలు సాగుతో పాటు కొద్దిపాటి పాడి పరిశ్రమ తోటల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని పంటలు పండిస్తున్నారు. తీరా దిగుబడి చేతికి వచ్చాక ధాన్యం విక్రయించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అంటున్నా క్షేత్రస్థాయిలో విరుద్ధంగా ఉందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికి వాటి నిర్వహణ తీరును పట్టించుకోవడం లేదు. కొన్ని కేంద్రాల వద్ద పడిగాపులు కాసిన నత్తనడకన ధాన్యం విక్రయాలు జరగడంతో చేసేదేమి లేక దళారులను ఆశ్రయించి విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. మద్దతు ధరతోపాటు బోనస్ కోల్పోతున్నామని రైతులు వాపోయారు.

మండలంలో ఇలా..

మండలంలో గత నెల 25న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండలంలోని 24 గ్రామాల్లో 8995 ఎకరాల్లో వరి సాగు చేశారు. సింగిల్ విండో ద్వారా 11 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ కొనుగోలు 8 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 85వేల వరి ధాన్యం బస్తాలను 442 రైతుల నుంచి కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన రైతులందరికి వారి అకౌంట్లలో డబ్బులు జమ అయినట్లు రైతులు తెలిపారు.

లారీల, గన్నీ బ్యాగుల కొరత

గన్నీ బ్యాగుల కొరతతో పాటు లారీలు అందుబాటులో ఉండటం లేదు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. అక్కడక్కడ అధికారులు తనిఖీ చేసిన ఫలితం లేదు. దొడ్డు వడ్ల కొనుగోళ్లలో మాత్రం ఇబ్బందులు ఎదురువుతున్నాయని రైతులు వాపోతున్నారు. నానా రకాల కొరివిలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు తెలిపారు.

పడిగాపులు కాస్తున్నాం



మొత్తం రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. 200 బస్తాల వరకు వరిధాన్యం పండింది. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే లారీల కొరత ఉంది. మిల్లర్ల దగ్గర పడిగాపులు కాస్తున్నాం. మౌలిక వసతులు కూడా లేవు.

– బాలస్వామి, రైతు అల్లాపూర్

కొనుగోలు చేస్తున్నాం



రైతులకు ఇబ్బందులు లేకుండా సింగిల్ విండోద్వారా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. అందుబాటులో సిబ్బందిని ఏర్పాటు చేశాం. సంచుల కొరత ఉండటంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయి. బోనస్ డబ్బులు రైతుల ఖాతాలో జమచేస్తున్నాం.

– రాంచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కొల్లాపూర్ రూరల్: హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని తాళ్ల నరసింహ పురంలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన అసత్య ప్రచారాలు నమ్మి మోసపోయాయన్నారు. కొల్లాపూర్ అభివృద్ధిని మంత్రి పూర్తిగా విస్మరించారని విమర్శించారు. నియోజక అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. దేశం కోసం, ధర్మం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ బీజేపీ ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న ఎల్లేని సుధాకర్ రావు

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

అచ్చంపేట రూరల్: నల్లమలలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకుంటారనే సమాచారంతో ముందస్తుగా పలు పార్టీల నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

లింగాలలో..

లింగాల: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటారని సమాచారంతో బీజేపీ మండల నాయకులను ముందస్తుగా సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సీఎం పర్యటన ముగిసిన తర్వాత బీజేపీ నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు నవీన్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పోలీసుల అదుపులో అచ్చంపేట బీజేపీ నాయకులు

గణితంపై 'పది' విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో గణితం పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు శిక్షణ అందించి పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గణితంలో ఫెయిలైన విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాల మేరకు మెలకువలు అందించారు. చిక్కేపల్లి ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం, గణితం ట్రైనర్ శివయ్య, గణితం ఫోరం జిల్లా అధ్యక్షుడు, పాన్‌గల్ బాలుర జీహెచ్‌ఎం విజయ్, కదిరెపాడు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం కృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఉపాధ్యాయులు వెంకటేష్‌యాదవ్, ఎమ్మార్సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వ్యవసాయ పనులు

నాగర్‌కర్నూల్ రూరల్: మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు తమ పొలాల్లో పనులను ముమ్మరంగా చేస్తున్నారు. వారం రోజుల్లో రానున్న రోహిణి కార్తిని అనుగుణంగా రైతులు దుక్కులను దున్నుతున్నారు. రైతులు ఆరంభంలోనే వర్షాలు కురిస్తే వెంటనే పత్తి విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. మొక్కజొన్న లేదా మినుములు విత్తుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.



దుక్కులు దున్నుతున్న రైతు

పనులను పరిశీలించిన సామాజిక తనిఖీ బృందం

వెల్దండ: మండలంలోని గుండాలలో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ నర్సయ్య పరిశీలించారు. గ్రామంలో 2022 సంవత్సరంలో ప్రధానమంత్రి ఆదర్శ్‌గ్రామ్ యోజన పథకం కింద రూ.20లక్షల నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనంతో పాటు గ్రామంలో దళిత కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్ర స్థాయిలో సందర్శించారు. వాటి నాణ్యత ప్రమాణాలు, కొలతలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి, కార్యదర్శి వాణి, సామాజిక బృందం సభ్యులు గీత, నీరజ, శేఖర్,ప్రసాద్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సుజాత, మణెమ్మ, శ్రీను తదితరులు ఉన్నారు.



పనులపై చర్చిస్తున్న సామాజిక తనిఖీ బృందం

వర్షపు నీరు నిల్వ.. గ్రామస్తుల అవస్థలు



తెలకపల్లి: మండలంలోని కారువంగ గ్రామంలో వీధులు గుంతలమయంగా మారడంతో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీంతో గ్రామస్తులు వీధుల గుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు అడుగుతీసి అడుగువేసేందుకు జంకుతున్నారు. పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. చెన్నకేశవ గుడి సమీపంలో సీసీ రోడ్లు లేక వీధుల్లో మోకాల్లోతు నీరు దర్శనమిస్తోంది. ఇళ్ల మధ్యనే నీరు ఉండటంతో బయటకు వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మట్టి రోడ్లపై మొరం వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వచ్చే వర్షాకాలం నాటికి సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

తాడూరు: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం ఆవరణంలో అచ్చంపేట కల్వకుర్తి డివిజన్ సాంఘిక ఉపాధ్యాయులకు 5 రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో వివిధం అంశాలను అవగతం చేసుకోవాలన్నారు. శిక్షణలో ఆర్పీలు ఇచ్చిన సూచనలు పాటించాలన్నారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

పాన్‌గల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులతో పాటు ఎఫ్‌ఎల్‌ఎన్‌పై కూడా శిక్షణ ఉంటుందన్నారు. ప్రాథమిక విద్య పూర్తియ్యే సరికి ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలో నైపుణ్యాలు సాధించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వీపనగండ్ల: విద్యార్థులకు సులభతరంగా విద్య నేర్పేందుకు అవలంబించాల్సిన విధానాలపై ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల విద్యాధికారి నర్సింహులు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం నుంచి 24వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శిక్షణకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్లు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు వి.ధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



కల్వకుర్తిలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



కొల్లాపూర్‌లో బోనాల కోలాటం శిక్షణలో మహిళలు

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం 15 రోజుల పాటు కొనసాగాయి. విద్యార్థులకు బేసిక్ మ్యాథమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, డ్యాన్స్, ఆటలు, కరాటే, అల్లికలు తదితర విభాగాలలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సోమవారం ముగింపు సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు. హెచ్‌ఎం చిరంజీవి వెంకట్ రమణ, సంతోషి మల్లేష్, యూసుఫ్ బాబా, గణేష్, నారాయణ గౌడ్, మాస్టర్ రాజు, మాధురి తదితరులు పాల్గొన్నారు.

నందివడ్డెమాన్‌లో

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో ఏర్పాటు చేసిన 15 రోజుల వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, డ్రాయింగ్ స్కిల్స్, చేతిరాత నైపుణ్యాలు, గణిత మూలాలు, ఇండోర్ గేమ్స్ తదితర వాటిని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ రఘునందన్‌రావు హాజరై మాట్లాడారు. చదువుతో పాటు సృజనాత్మక సంబంధించిన అంశాలపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం హనుమంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, యాదగిరావు, హుస్సేన్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో 15 రోజుల పాటు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. విద్యార్థులకు పలురకాల అంశాలపై శిక్షణ ఇచ్చారు. నేర్చుకున్న పలు అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఎంఈఓ సత్యనారాయణ శెట్టి, ఉపాధ్యాయులు సుధాకర్, తిమోతి, శ్రీనివాసులు, రత్నమాల, కార్తీక్, వెంకటేష్, సుధాకర్‌గౌడ్, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి శిక్షణా తరగతులు

కొల్లాపూర్: పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సోమవారం తరగతులను ఫౌండేషన్ ట్రస్టీ జూపల్లి జగన్మోహన్‌రావు, జూపల్లి అరుణ్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. తెలంగాణ సాంస్కృతిక శాఖకు చెందిన ట్రైనర్స్ విద్యార్థులు, మహిళలకు పేరిణి నృత్యం, కర్ణాటక సంగీతం, పెయింటింగ్, బోనాల కోలాటం, ఫోక్ డాన్స్, నాటక ప్రదర్శనలపై శిక్షణ ఇచ్చారు. ఆసక్తి గల వారు నేరుగా శిక్షణా శిబిరానికి హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ కోరారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



తిమ్మాయిపల్లి నుంచి బయలుదేరుతున్న కాంగ్రెస్ నాయకులు

చారకొండ: అచ్చంపేట నియోజకవర్గంలో మాచారంలో ఇందిర సౌర గిరి జల వికాస పథకం ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని సిర్సనగండ్ల, శాంతిగూడెం, గైరాన్ తండా, మర్రిపల్లి, తుర్కలపల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల నుంచి వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు, మహిళలు యువకులు, అభిమానులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమాల్లో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, గణేష్ గౌడ్, శంకర్ గౌడ్, జైపాల్, శ్రీపతి రావు, రాజేష్ గౌడ్, సందీప్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రశాంత్ నాయక్ ఉన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ మండలం మాచారంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. పలువురు ప్రత్యేక వాహనాల్లో వెళ్లగా మరికొందరు అధికారికంగా, పార్టీ పరంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో వెళ్లారు.

ఘనంగా ఎల్లమ్మ పండుగ

తెలకపల్లి: మండలంలోని గట్టురాయిపాకులలో ఎల్లమ్మ పండుగను నిర్వహించారు. గ్రామంలోని అలేటి వంశస్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సోమవారం వేషధారణలో బైండ్ల వారు రౌడు రాక్షసిని కొలిచే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పెద్ద ఎత్తున డప్పుచప్పుల మధ్యన విన్యాసాలు, కేరింతలు కొట్టారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మా కరుణించు అంటూ వేడుకున్నారు. అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. మామిడి, వేపాకు, నిమ్మకాయలతో అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆడపడుచులతో గ్రామ వీధులు సందడిగా మారాయి.



విన్యాసాలు ప్రదర్శిస్తున్న భక్తులు

సుందరయ్య జీవితం ఆదర్శం



నాగర్‌కర్నూల్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికి ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పర్వతాలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సుందరయ్య నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. పొదిలి రామయ్య, శ్రీనివాసులు, యాదయ్య అశోక్, సురేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

తాడూరు: భూమి, భుక్తి కోసం సాయుధ రైతాంగ పోరాట ఉద్యమ సారథి ఆశయాలను కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం జెండాను ఆవిష్కరించారు. సీపీఎం మండల శాఖ కార్యదర్శి కాశన్న, బంగారయ్య, బాలరాజ్ వెంకటేష్ రులు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం పుచ్చపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ సాయుధ భూ పోరాటానికి సారథ్యం వహించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడంతో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. బాల్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పరశురాములు, శ్రీనివాసులు, బాలయ్య, పదివేల, నెహ్రూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో..

లింగాల: మండలంలోని రాయవరంలో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి సీపీఎం జెండాను ఆవిష్కరించారు. శంకర్‌నాయక్, స్వామి, మల్లయ్య, శరమంద, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ నివాళులర్పించారు.



కల్వకుర్తి సీపీఎం కార్యాలయంలో..



తాడూరులో..